క్లుప్తంగా

చంద్రబాబు,లోకేష్‌లపై పోలీసులకు ఫిర్యాదు


పుంగనూరు : పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నవీన్ కుమార్‌రాజు


కుప్పం : అర్బన్ ఎస్‌ఐ శివకుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సభ్యులు


సోమల : ఎస్‌ఐ నరసింహులుకు ఫిర్యాదు చేస్తున్న షేక్ బాషా

పుంగనూరు/కుప్పం/సోమల: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్, అచ్చెన్నాయుడులపై శుక్రవారం పుంగనూరు, కుప్పం, సోమలలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుంగనూరులో జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్‌రాజు, కుప్పంలో సోషల్ మీడియా సభ్యులు దామోదరం, గణపతి, మహేష్, సాధిక్, సోమలలో నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్ షేక్ బాషా ఈ ఫిర్యాదులు చేశారు. పథకం ప్రకారం ఆ ముగ్గురూ ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఫిర్యా దులో పేర్కొన్నారు. పుంగనూరులో పోలీసులపై దాడులకు కారకులయ్యారని గుర్తుచేశా రు. అంతేకాకుండా ఏ కార్యకర్తపై ఎక్కువ కేసులుంటాయో వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని లోకేష్ ప్రకటించడం శోచనీయమని నిరసించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే భవిష్యత్తులో వీరు తీవ్ర పరిణామాలకు కారకులవుతారని పేర్కొ న్నారు. కార్యక్రమంలో అస్లాం మురాది, గంగాధరం, యూనస్, శ్యాంసుందర్, శివకుమార్, అఫ్రీద్, మాలిక్, పీఎల్ఆర్ రాజారెడ్డి, ఆటో ప్రసాద్, ముబారక్, జుబేర్ బాషా, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మర్రి మొక్కకు చంద్రయాన్‌-3 నామకరణం



గంగవరం: చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పలమనేరు మున్సిపాలిటీ గంటావూరుకి సమీపంలో శుక్రవారం మర్రి మొక్కను నాటారు. ఆ మొక్కకు అందరూ చంద్రయాన్ 3గా నామకరణం చేశారు. ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో నేతాజీ సిద్ధయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

15 ఏళ్ల అంధకారం నుంచి విముక్తి
–సీజేఎఫ్‌ఎస్ కాలనీకి విద్యుత్ సౌకర్యం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ సీజేఎఫ్ కాలనీకి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. శుక్రవారం ఆ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి లైట్లు ఆన్ చేశారు. కాలనీలో 7 కుటుంబాలు దాదాపు 15 ఏళ్లుగా అటవీ ప్రాంత సమీపంలో నివాసమున్నాయని, ఆ కుటుంబాల విజ్ఞప్తిపై మంత్రి స్పందించి రూ3.5 లక్షలతో ప్రత్యేకంగా కాలనీకి సింగిల్‌ఫేజ్ లైను ఏర్పాటు చేయించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతమ్మ, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్, ఉప సర్పంచ్ కృష్ణంరాజు, నేతలు చెంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అల్తాఫ్, రెడ్డిఖాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీలో ఇద్దరికి స్థానం


రాధాకృష్ణ


జాన్సీ

గంగవరం: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో మండలంలోని నాలుగురోడ్లకు చెందిన రాధాకృష్ణ, సాయినగర్‌కు చెందిన జాన్సీ ఎగ్జిగ్యూటివ్ మెంబర్స్‌గా నియమితులవడంతో వారు ఎమ్మెల్యే వెంకటేగౌడ, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. బైరెడ్డిపల్లెలో ఎమ్మెల్యేని కలిసి సత్కరించారు.

వరలక్ష్మీ మాతా నమోస్తుతే!


పుంగనూరు: వెండి, ఆభరణాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ


కుప్పం : తిరుపతి గంగమ్మ దేవాలయంలో వ్రత పూజలు చేస్తున్న మహిళలు


బైరెడ్డిపల్లె : విశేష పూజలు అందుకున్న శ్రావణలక్ష్మి


గుత్తార్లపల్లెలో..


శాంతిపురం : పూజలు అందుకున్న లక్ష్మీదేవి


పుంగనూరు: కరెన్సీ నోట్లతో శ్రీవిరూపాక్షి మారెమ్మ


పులిచెర్ల : లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..


సదుం: ప్రత్యేకాలంకారంలో వరలక్ష్మీ విగ్రహం


మారెమ్మ ఆలయంలో ముత్తయిదువులకు వాయినాలు ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


పెద్దపంజాణి : రాయలపేటలో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు


వి.కోట : ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి


రామకుప్పంలో..

- భక్తిప్రపత్తులతో శ్రావణ శుక్రవార పూజలు

పుంగనూరు: పట్టణంలో శ్రావణ శుక్రవార పూజలను ప్రతి ఇంటా భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మహిళలు వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని వెండి, బంగారు, మట్టితో తీర్చిదిద్ది ప్రత్యేకంగా అలంకరించారు. డబ్బు, నగలు, మట్టిగాజులు పెట్టి పూజలు చేశారు. అలాగే పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మను కరెన్సీ నోట్లతో అలంకరించారు. శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, శ్రావణ శుక్రవార కథలను భక్తులకు వినిపించారు. రకరకాల పిండివంటలు, పూలు, పండ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

చౌడేపల్లె: మండల వ్యాప్తంగా గ్రామాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. ఇళ్లలో లక్ష్మీదేవి ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

సదుం: మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలోనూ వ్రతమాచరించారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలో వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిప్రపత్తులతో చేశారు. దేవళంపేటలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహిళలతో అర్చకులు అనంతాచార్యులు వ్రతం చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఆలయ నిర్వాహకులు దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలవ్యాప్తంగా వరలక్ష్మీ వత్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు గుణశేఖర్ ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులను ప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే కట్ట శివాలయంలో అర్చకులు మునిరాజ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

పలమనేరు నియోజకవర్గం

పలమనేరు : మున్సిపాలిటీ పాతపేటలోని తాలూకాచేరి వీధిలోని శ్రీ సత్య గంగమ్మ ఆలయంలో అమ్మవారిని రూ. 2లక్షల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. అలాగే మారెమ్మ ఆలయంలో పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది ముత్తయిదువులకి వాయినాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీక్రిష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంగవరం: మండలవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మహిళలు వరలక్ష్మీ వ్రతమాచరించారు. తమ ఇళ్లలోని కలశాలతో అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి నూతన వస్త్రాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పరస్పరం వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు ఇళ్లలో కలశం, అమ్మవారి విగ్రహాన్ని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకుని కంకణాలు ధరించారు.

బైరెడ్డిపల్లె: మండల వ్యాప్తంగా ప్రజలు వరలక్ష్మీ వ్రత పండుగను వేడుకగా జరుపుకున్నారు. శ్రావణ లక్ష్మీ ప్రతిమలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి గృహాల్లో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వి.కోట: మండల వ్యాప్తంగా మహిళలు తమ ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతపూజలు చేశారు. పలు ఆలయాల్లో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయాల్లో మహిళలు దీపారాధన చేశారు. పూజల అనంతరం ముత్తైదువులు గాజులు, పసుపు, కుంకుమ ఇచ్చి పుచ్చుకున్నారు.

కుప్పం నియోజకవర్గం

కుప్పం: పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయంలో వేద పండితులు వరలక్ష్మీ వ్రతం ప్రాముఖ్యత కథను వినిపించారు. ఆలయ ప్రాంగణంలో వ్రత పూజలు చేసిన మహిళలకు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ పసుపు, కుంకుమ అందజేశారు. అలాగే మహిళలు ఇళ్లలో మహాలక్ష్మి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మహిళలను ఇళ్లకు ఆహ్వానించి పసుపు, కుంకుమ సారెను అందజేసి ముత్తయిదువుల ఆశీస్సులు పొందారు. అలాగే గుత్తార్లపల్లెలోని శ్రీ ప్రసన్న తిమ్మరాయస్వామి దేవాలయంలో మహాలక్ష్మి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామస్తులు పూజలు చేశారు.

రామకుప్పం: పలు దేవాలయాల్లో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. మహిళలు ఇంట్లో మహాలక్ష్మి అమ్మవారిని కొలువుదీర్చారు. ఉపవాస దీక్షలతో పూజలు చేశారు. పురోహితులు వరమహాలక్ష్మి వ్రతం చేయించి వ్రత విశిష్టతను తెలిపారు. సాయంత్రం ముత్తైదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

గుడుపల్లె: మండల కేంద్రంతోపాటు అగరం, ఒంటిపల్లె తదితర గ్రామాల్లో వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా చేశారు. గ్రామాలలోని మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేసి, పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి, వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతిపురం: మండల వ్యాప్తంగా వరమహాలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లలో పూజలు చేసి, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చారు. బెండనకుప్పం వద్ద ఉన్న శ్రీ చక్రనామాంకిత లక్ష్మీదేవి ఆలయంలో నిర్వహించిన సామూహిక వ్రతంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చౌడేపల్లెలో..




రొంపిచెర్ల : ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ


గంగవరం : విశేష అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు


పలమనేరు : కరెన్సీ నోట్ల అలంకరణలో సత్య గంగమ్మ

రాయితీపై ఉలవలు పంపిణీ


రామకుప్పం : ఉలవలు పంపిణీ చేస్తున్న విజలాపురం బాబురెడ్డి


పులిచెర్ల: ఉలవలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


గంగవరం : గుండుగల్లులో..


పెద్దపంజాణిలో..

రామకుప్పం: మండలంలోని విజలాపురం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రాయితీపై ఉలవ విత్తనాలను మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, స్థానిక సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు 80 రాయితీతో ఉలవలను పంపిణీ చేస్తోందని, రాయితీపై రూ.21.60లకే ఇస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామే గౌడు, మురుగేష్, రైతు భరోసా కేంద్రం అధికారి ఆనంద్, నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని గుండుగల్లులో శుక్రవారం ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రమణ రైతులకు సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేశారు. 18 ఆర్‌బీకే కేంద్రాలలో 154 క్వింటాళ్ల ఉలవలు ఉన్నట్టు వ్యవసాయాధికారిణి హేమలత తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప సబ్సిడీపై ఉలవ విత్తనాలు పంపిణీ చేశారు. మండలంలో 345 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. అలాగే ఆర్‌బీకేలలో 76.10 టన్నుల యూరియా, 32.80 టన్నుల డీఏపీ, 24.40 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయాధికారి రఫీఖా తెలిపారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి పొందవచ్చన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై ఉలవలను ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాదమునిరెడ్డి, గోవిందరెడ్డి, ఆనందరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి శాంతిపురంలో..

శాంతిపురం: వర్షాలు ఆలస్యం కావడంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయి రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు సాగు చేయవచ్చని మండల వ్యవసాయ అధికారి అప్పోజి తెలిపారు. సబ్సిడీపై ఉలవలను రైతు భరోసా కేంద్రాలలో పొందవచ్చన్నారు. శనివారం అబకలదొడ్డిలో ఎమ్మెల్సీ భరత్ విత్తనాల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన



సదుం: మండలంలోని జాండ్రపేటలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు సురేంద్రరెడ్డి తెలిపారు. 26న గ్రామ ప్రదక్షిణ, గంగపూజ, గణపతి పూజ, హోమం, 27న యాగశాల ప్రవేశం, కుంభారాధన, రుద్రహోమం, శాంతి హోమం, కలశ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, 28న కలశార్చన, మహాకుంభాభిషేకం, మహారుద్రాభి షేకం, సర్వదర్శనం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తామని వివరించారు.

మొక్కలు పంపిణీ

వి.కోట: భావితరాలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించడానికి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని నరేంద్ర, అమరనాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముదిమడుగు గ్రామంలో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను రైతులు, ప్రజలకు వారు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆంజనేయులు, గ్రామస్తులు కృష్ణమూర్తి, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ సమావేశం

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ భరత్ గడప గడప కు మన ప్రభుత్వం నిర్వహిస్తారని, దీనిపై చర్చించేందుకు మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరాయి.

ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి

సదుం: విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ అన్నారు. స్థానిక ఎంజేపీ గురుకుల కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటేనే సులువుగా ఏదైనా సాధించగలరన్నారు.

కాన్పుల శాతం పెంచాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల శాతం పెంచాలని జిల్లా గణాంక అధికారి జార్జ్ అన్నారు. మండలంలోని చెరుకువారిపల్లె పీహెచ్‌సీని జిల్లా ఆరోగ్య విద్యాధికారితో కలిసి ఆయన తనిఖీ చేశారు. సచివాలయాల్లోని ఆరోగ్య కార్యకర్తలకు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడానికి కృషి చేయాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టరు శిరీష, హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్, జానకి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ


తీర్థంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. తీర్థం సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామీణాభివృద్ధి

ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించిన ముఖ్యమంత్రి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బైరెడ్డిపల్లె మండలంలో గత ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారును పట్టించుకోలేదని విమర్శించారు. గుంతలు పడిన రహదారుల్లో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు తమ వ్యవసాయోత్పత్తులను మార్కెట్లకు తరలించాలన్నా, రోగులు ఆసుపత్రులకు వెళ్లాలన్నా నరకయాతన అనుభవించేవారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక మండలంలోని టీఎస్‌కుప్పం, కడతట్లపల్లె, వెంగంవారిపల్లె, కుప్పనపల్లె, మిట్టకుర్రపల్లె, గుంతకుర్రపల్లె, తీర్థం నుంచి దాసార్లపల్లె వరకు, అలాగే కోత్రిపల్లె, సన్నిపల్లె, ఎం.కొత్తూరు, పెద్ద చల్లారగుంట, గాజీపేట, గడ్డిండ్లు, రెడ్డి జాలారిండ్లు తదితర గ్రామాలకు రహదారులు వేయించామన్నారు. దీనితో గ్రామాలకు కనెక్టివిటీ పెరిగి, రవాణా సదుపాయాలు మెరుగయ్యాయన్నారు.

బాబు పాలనలో దగా

చంద్రబాబు పాలనలో ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ సక్రమంగా అమలు చేయకపోగా మహిళలు, రైతు లను నిట్టనిలువునా దగా విమర్శించారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, తమ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తున్నామన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హతే కొలమానంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన ప్రజలకు కళ్ల ముందే కనబడుతున్నా ప్రతి పక్షాలు మాత్రం బురద జల్లుతున్నారన్నారు. మరో సారి ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్ననే ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, ఎంపీటీసీలు రవీంద్రమ్మ, వినాయకం, నాగరాజు, సర్పంచులు జ్యోతమ్మ, దేవేంద్రరెడ్డి, చంద్రమౌళి, బాలక్రిష్ణగౌడు, వెంకటేష్, రాజప్ప, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, ఎంఈఓ సాయిలీల, వ్యవసాయశాఖ అధికారిణి గీతారాణి, వైఎస్సార్‌సీపీ నేతలు కేశవులు, శ్రీనివాసులు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.